# ప్రజాశక్తి

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ఆదివారం 4 జనవరి 2026 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మార్కాపురం

సమావేశంలో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

# ప్రోటోకాల్ రగడ

- అభివృద్ధి కార్యక్రమాలకు పిలవటం లేదని జడ్‌పి చైర్‌పర్సన్ ఆవేదన
- ధ్వజమెత్తిన వై పాలెం ఎమ్మెల్యే, జడ్పీటిసిలు, ఎంపిపిలు
- నీళ్లు నమిలిన అధికారులు.. సమావేశానికి టిడిపి ఎమ్మెల్యేలు డుమ్మా
- మొక్కుబడిగా జడ్‌పి సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

జిల్లాలో, దర్శిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించటం లేదు. జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిల విషయంలో వివక్ష కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై యర్రగొండపాలెం తాటిపర్తి చంద్రశేఖర్, పలువురు జడ్‌పిటిసిలు, ఎంపిపిలు ధ్వజమెత్తారు. స్థానిక దక్షిణ బైపాస్ రోడ్డులో శనివారం జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జడ్‌పి సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో ఎపిసిపిడిసిఎల్, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖలు, ఇరిగేషన్, జిల్ల పంచాయతీ, జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పని తీరుపై చర్చించారు. సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో వైసిపి ప్రజాప్రతినిధుల పట్ల ప్రోటోకాల్ పాటించకపోవటంపై రగడ చోటు చేసుకుంది. జడ్‌పి సర్వసభ్య సమావేశానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ హాజరు కాగా, మంత్రి డిబివి స్వామితో పాటు టిడిపి ఎమ్మెల్యేలు సమావేశానికి డుమ్మా కొట్టారు. సిఎం పర్యటన ఏర్పాట్ల నేపథ్యంలో కలెక్టర్ పి రాజాబాబు ▶ 2లో

# టిడిపి బలోపేతానికి కృషి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: ఆనం రామనారాయణ రెడ్డి
- అట్టహాసంగా ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ఉగ్ర ప్రమాణ స్వీకారం

టిడిపి నాయకుల అభివాదం

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ, ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలు ఎస్‌జివిఎస్ ఫంక్షన్ హాలులో టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి డిసిఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఇస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు ఉగ్ర నరసింహారెడ్డి నేతృత్వంలో కమిటీ సభ్యులు, పార్టీ నేతలు టిడిపి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కొత్త కమిటీకి మంత్రి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర సాంఘిక పంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం 10 లక్షల కోట్ల అప్పు మిగిల్చి వెళ్లిందని, సమర్థుడైన సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఒంగోలు పార్ల మెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులుగా ఉగ్ర నరసింహారెడ్డిని ఎంపిక చేసిన సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం పనిచేయాలన్నారు. 2029 ఎన్నికలలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 స్థానాలను గెలుస్తామనే ఆశాభావం వ్యక్తం చేశారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడారు.

**పార్టీ కోసం శాయశక్తుల పనిచేస్తా**

**- టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు ఉగ్ర**

అందరి సహకారంతో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం శాయశక్తుల పనిచేస్తానని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి తెలిపారు. అవకాశం ఇచ్చిన పార్టీ జాతీయ అధ్యక్షులు, పిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్ రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, బిఎన్ విజయకుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్ బాబు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కె సీతారామయ్య, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టం సిపిఎం ఘనతే..

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ చింతా మోహన్ ▶ 8లో

# ప్రోటోకాల్ రగడ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి హాజరు కాలేదు.

**ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఆగ్రహం**

ఈ సందర్భంగా జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఇటీవల తాళ్లూరు కెజిబివి కళాశాల కొత్త భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తనను, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిని పిలవలేదని, అధికారులు ప్రోటోకాల్ ఎందుకు పాటించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులమని, తమకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిల విషయంలో ఇదే జరుగుతోందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ బి చిన ఓబులేసు మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో అధికారులు ప్రోటోకాల్ పాటించేలా చూస్తామని, ఆమేరకు సర్క్యులర్ జారీ చేస్తామని తెలిపారు.

**ప్రభుత్వంపై విమర్శలు చేయొద్దు**

**ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి**

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు వేయవద్దని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి సూచించారు. వెలింగొండ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.

**టిడిపి ఇన్‌ఛార్జులను పిలవటమేమిటి?**

వై.పాలెం, దర్శి నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు ఉంటే టిడిపికి చెందిన ఇన్‌చార్జులను అభివృద్ధి కార్యక్రమాలకు పిలవటం ఏమిటని, వారికి పెద్దపీట వేయాలని ఎక్కడ ఉందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో జరిగే ఏ కార్యక్రమంలోనూ అధికారులు ప్రోటోకాల్ పాటించటం లేదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు జరిగే వేదికపై టిడిపి ఇన్‌చార్జికి ప్రాధాన్యత తగదన్నారు. ఇదే విషయమై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని అన్నారు. అవసరమైతే కోర్టుకెళతామని హెచ్చరించారు. అదేవిధంగా జగనన్న కాలనీలలో వేసిన ట్రాన్స్‌ఫార్మర్స్ తొలగించిన విషయంపై అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు.

**విద్యుత్ పోల్స్ సరైన స్థలంలో వేయాలి**

**- ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్**

ఆర్‌డిఎస్ఎస్ పథకంలో విద్యుత్ స్తంభాలు సరైన స్థలాలలో వేయాలని ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ఎపిసిపిడిసిఎల్ అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులకు కలుగకుండా విద్యుత్ స్తంభాలు వేయాలని అదికారులకుసూచించారు.

**కొత్త జిల్లా ప్రారంభోత్సవాలకు పిలవరా?**

**మార్కాపురం జడ్‌పిటిసి నారు బాపనరెడ్డి**

కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవాలకు ప్రజాప్రతినిధులను పిలవరా అని జడ్‌పిటిసి నారు బాపనరెడ్డి ప్రశ్నించారు. కలెక్టర్ రాజాబాబు, డిఆర్ఒ, ఆర్డీవోలు ఉంటే జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవాలకు తనను, సర్పంచ్, ఎంపిపి, ఎంపిటిసిలను పిలవకపోవటం దారుణమని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలని కోరారు.

**18 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వరా**

**- త్రిపురాంతకం జడ్‌పిటిసి మాకం జాన్‌పాల్**

జడ్పీటిసిలకు 18 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వటం లేదని త్రిపురాంతకం జడ్‌పిటిసి మాకం జాన్‌పాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల ఎమ్మెల్యేలు, అధికారులు జీతాలు తీసుకుంటున్నారని, ఎమ్మెల్యేకు వచ్చే వేతనాలతో 50 జడ్‌పిటిసిల వేతనాలు చెల్లించవచ్చన్నారు. జిల్లాలోని సర్పంచ్‌లు, ఎంపిపిలు, ఎంపిటిసిలకు గౌరవ వేతనాలు ఇవ్వాలని కోరారు. టంగుటూరు ఎంపిపి కోటేశ్వరమ్మ మాట్లాడుతూ తమకు కార్ అలవెన్స్ ఇప్పించాలని కోరారు. జడ్‌పి సిఈఒ బి చిరంజీవి మాట్లాడుతూ జడ్‌పిటిసిలకు రావాల్సిన గౌరవ వేతనంపై ప్రభుత్వానికి లేఖ రాశామని, త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో 2025-26 వార్షిక బడ్జెట్, అజెండాలోని సాధారణ అంశాలు, వివిధ స్థాయి సంఘాల ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశంలో బాపట్ల డిఆర్ఒ జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

# కొత్త ఉపాధి చట్టాన్ని ఐక్యంగా అడ్డుకుందాం

**ప్రజాశక్తి-సిఎస్ పురం రూరల్**

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన కొత్త ఉపాధి చట్టాన్ని ఐక్యంగా అడ్డుకుందామని సిపిఎం నాయకులు కోరారు. గ్రామీణ్ జి రామ్ జి పేరుతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన చట్టం వల్ల కూలీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ సిపిఎం నాయకులు మండలంలోని సిఎస్పురం, ముండ్లపాడు, నల్లమడుగుల, కోమటిగుంట్ల, అరివేముల, ఉప్పలపాడు తదితర గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా గత 18 సంవత్సరాలుగా వలసలు తగ్గించి సన్న, చిన్నకారు రైతుల భూములు అభివద్ధి చేశారని తెలిపారు. కరువు ప్రాంతాల్లో ఉద్యాన పంటలు విస్తరణకు, గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు లాంటి మౌలిక సౌకర్యాల కల్పనకు ఉపాధి నిధులు తోడ్పడ్డాయన్నారు. పంట కాలువలు మరమ్మతులకు ఉపయోగపడ్డాయని తెలిపారు. ఇంతటి కీలకమైన చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నీరు కార్చిందన్నారు. మారిన చట్ట ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, ఎం.రత్నారెడ్డి, అజిద్ బాషా, ఏసుదాసు, రమేష్, నారయ్య, అంకేపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, రత్నం, భాస్కర్ రెడ్డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దాలి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి -మద్దిపాడు :** మద్దిపాడు గ్రామాన్ని స్వచ్ఛగ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమంలో భాగంగా మద్దిపాడులో ఎంపిడిఒ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ప్రకటించేందుకు గ్రామస్తులు సహకరించాలని అన్నారు. ఎ.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కొండపి రఘుబాబు, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

## కడప వంశీధర్ రెడ్డికి శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-గిద్దలూరు :** వైసిపి రాష్ట్ర ఆర్‌టిఐ యాక్ట్ వింగ్ జనరల్ సెక్రటరీ, మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మిని వైసిపి నాయకులు, కార్యకర్తలు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానుల మధ్య కడప వంశీధర్ రెడ్డి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు

## గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శికి శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం :** ఎపి గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌ను యర్రగొండపాలెం మండల గిరిజన నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని పాలుట్ల గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి చెవుల అంజయ్య, పాలుట్ల వీటిడీప ప్రెసిడెంట్ నిమ్మల ఈదన్న, వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీ సర్పంచి బోడా శ్రీశైలపతి నాయుడు, గుట్టలచేను ఈడీసీ ప్రెసిడెంట్ దేశవత్ బస్సే నాయక్, పాలుట్ల గ్రామ పెద్ద నేనావత్ మల్లు నాయక్, హెడ్మాస్టర్ పాలుట్ల తాటి బైస్వామి, పాలుట్ల స్కూల్ అసిస్టెంట్ భూమని అంకన్న పాల్గొన్నారు.

## అధికారులకు ఈ గవర్నరెన్స్ పై శిక్షణ

**ప్రజాశక్తి - కనిగిరి :** పంచాయతీరాజ్ వ్యవస్థలో ఈ-గవర్నెన్స్‌ను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో కనిగిరి డివిజన్ పరిధిలోని అధికారులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దర్శి, దొనకొండ, పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ల, కురిచేడు మండలాలకు చెందిన అధికారులకు, కనిగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కనిగిరి, పెద్ద చెర్లోపల్లి, పామూరు, హనుమంతునిపాడు, పొన్నలూరు, చంద్రశేఖరపురం, వెలిగండ్ల మండలాలకు చెందిన అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్ కె. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా, నాణ్యంగా, పారదర్శకంగా అందాలంటే ఈ-గవర్నెన్స్ కీలకమైన సాధనమని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు.

## గోదాదేవి అమ్మవారికి సారె అందజేత

**ప్రజాశక్తి -చీమకుర్తి :** ధనుర్మాసం సందర్భంగా స్థానిక శ్రీ హరి హర క్షేత్రంలోని గోదాదేవి అమ్మవారికి రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో సారే, పసుపు కుంకములు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా సాయిబాబా దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా బాలాజీ దంపతులు, సురేష్ దంపతులు, శిద్దా పుష్పలత, శిద్దా జై భారతి తదితరులు పాల్గొన్నారు.

## 'మాలకొండ' క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి- వలేటివారిపాలెం :** మాలకొండలోని శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహం స్వామి దేవస్థానం క్యాలెండర్‌ను ఆలయ డిసి చంద్రశేఖర్ శనివారం ఆవిష్కరించారు. ఒంగోలుకు చెందిన మద్దాల నరసింహారావు ఆయన కుటుంబ సభ్యులు ఆలయ క్యాలెండర్ల, పాకెట్ డైరీలు తయారీ చేయించారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌రావు,ఆలయ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: KANDUKUR,**

**E.P. NO. 11/2025**

**O.S. NO. 89/2017**

Chenna Rajya Lakshmi and 3 others.
...DHRs/plaintiffs.
V/s
Bathula. Sivaram Prasada Rao
....J.D.R / Defendant.

*To,*
Bathula. Sivaram Prasada Rao,
Slo. Brahmaiah,
Business, R/o. 9th ward, Subhash Road,
KANIGIRI,
old Prakasam-DT. A.P.
Markapuram DT, A.P.

పై నంబరున D.H.Rs/ వాదులు మీ మీద E. P. పిటీషన్ పరిహారముల నిమిత్తం E.P. పిటీషన్ దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం తేది. 07-01-2026కివాయిదా వేసియున్నారు. వాయిదా రోజు ఉదయం గం.10-30 ని.లకు పైకోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : 07-01-2026
కందుకూరు.

**వై.సాంబశివరావు**
D.H.Rs/ వాదులు తరుపు అడ్వకేట్
కందుకూరు

**జనరల్ నోటీసు**

మా క్షయింటు గుర్రం వెంకట్రావు తండ్రి సుబ్బారాయుడు. నందావారివీధి, కందుకూరు టౌన్ & మున్సిపాలిటి,శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సంజాయిషి మేరకు,

మా క్లయింటు 20-11-2025న రిజిష్టరు డాక్యుమెంటు నెం 6575/25 క్రింద ఇస్కబాయ్, బీరంగూడ, అమీన్‌పూర్ గ్రామం & మున్సిపాలిటి,అమీన్‌పూర్ మండలం,సంగారెడ్డి జిల్లా, తెలంగాణా స్టేట్, సర్వేనెం: 835, ప్లాటునెం: 133. 200 చ. గజములు లేదా 167-22 చ.మీటర్లు గల స్థలము మరియు లింకు డాక్యుమెంటు అయిన రిజిష్టరు డాక్యుమెంటు నెం. 3793/1985 తీసుకొని మాక్లయింటు నందావారి వీధిలోని తన ఇంటి నుండి పామూరు రోడ్డులోని Oxford School దగ్గరకు ఉదయం 8.30 గంటల సమయములో తన బైక్ మీద వెళ్ళుచుండగా పైన చూపిన డాక్యుమెంట్లు ఉన్న ఫైలు పోయినది. ఎంత ప్రయత్నించినను దొరకలేదు. ఎవరికైన పైచూపిన రెండు డాక్యుమెంట్లు దొరికిన యెడల మొబైల్ నెం.9398366788కు తెలియ చేయగలరు.

**V. శ్రీధర్ నాయుడు**
**అడ్వకేటు, కందుకూరు.**

**మహారాజశ్రీ ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**OS No : 760/2019**

గుట్లపల్లి జయలక్ష్మీ ... వాది
వర్సెస్
గుద్దేటి వెంకట నరేంద్రబాబు (డైడ్ వగైరాలు
...ప్రతివాదులు

*To*
**D3)**గుద్దేటి వెంకట శ్రావణి
D/o వెంకట నరేంద్రబాబు
**D4)** గుద్దేటి వెంకట శ్రీనాథ్ బాబు
S/o వెంకట నరేంద్రబాబు
పై వారి ఇద్దరి నివాసం :
వెంకటేశ్వర నగర్ ఫస్ట్ లైన్,ఒంగోలు

పై నంబరు లోని వాది మీ వగైరాలుపై నగదు వసూలు నిమిత్తం దావా వేసియున్నారు సదరు దావా తేది : 09-01-2026న వాయిదా అయిఉన్నది ఆ రోజు ఉదయం గం.10.30 నిమిషాలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీఆక్షేపణలు తెలుపుకొన వలెయను లేని యెడల మీ పరోక్షమున తీర్మానించ బడునని తెలియ జేయడమైనది

**// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //**

ఇట్లు
**M.అజయ్ బాబు**
**G.రామమూర్తి**
**Y.మౌనిక, A.వెంకటేశ్వర్లు**
**అడ్వకేట్స్**
**రాజాపానగల్ రోడ్డు, ఒంగోలు**

**మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**I.A. 1118/2023, I.A. 1119/2023**
**I.A. 1120/2023 in O.S. 01/2020**

సైరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ..పిటిషనర్/వాది
వర్సస్
పిదప భాస్కర్ రెడ్డి వగైరాలు
..రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

*To*
రెస్పాండెంట్స్ / ప్రతివాది చిరునామా
**R3)**బొమ్మాజి అలియాస్ బిహెచ్‌కె సరోజినీ
భర్త లేట్ దానం, 68 సం.లు, హిందూ, గృహిణి,
**R4)**బొమ్మాజి అలియాస్ బిఎన్ విజయ్ కుమార్
తండ్రి లేట్ దానం, 48 సం.లు, హిందూ, ఎమ్మెల్యే,
**R5)**బొమ్మాజి కిషోర్ తండ్రి లేట్ దానం,
46 సం.లు, హిందూ, ఉద్యోగి,
**R6)**బొమ్మాజి సునీల్ తండ్రి లేట్ దానం,
44 సం.లు, హిందూ, ఉద్యోగి,
**R7)**బొమ్మాజి అనిల్ తండ్రి లేట్ దానం,
42 సం.లు, హిందూ, ఉద్యోగి,
పై వారందరి చిరునామా
హౌస్ నెం. 2-51, పెద్ద నల్లకాలువ గ్రామం,
కంభం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్ / వాది మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో మీరు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ05-01-2026న వాయిదా వుండినది. కావున మీరు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీపరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

**// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //**

ఇట్లు
**శ్రీ పి.యన్.శేషశయనారెడ్డి,**
**శ్రీ యం.రంగారెడ్డి,**
**పిటిషనర్ / వాది పరం అడ్వకేట్స్,**
**గిద్దలూరు, ప్రకాశం జిల్లా,**

**మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**O.S. No : 143/2024**

మున్నెల్లి శ్రీనివాసరెడ్డి ..వాది
వర్సస్
గుంటూరు హరిక్రిష్ణకాంత్ .. ప్రతివాది

*To*
ప్రతివాది :
గుంటూరు హరిక్రిష్ణకాంత్ తండ్రి సుబ్బారావు, వయస్సు 32 సం.లు, హిందూ, సాఫ్ట్ వేర్ ఉద్యోగి, శివశంకర్ నగర్, విశాఖపట్టణం, ప్రస్తుతం విష్ణు పీజీ హాస్టల్,7వ క్రాస్, నీలాద్రినగర్, ఎలక్ట్రానిక్స్ సిటీ, ఫేజ్ -1, బెంగుళూరు, కర్ణాటక రాష్ట్రం.

పై నెంబరు దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది 09-01-2026న ఉదయం గం. 10:30 ని.లకు స్వయంగా గాని, లేదా నీవకీలు గారి ద్వారా గాని హాజరై, నీఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో నీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

**// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //**

**స్థలం : గిద్దలూరు**
**తేదీ : 31-12-2025** ఇట్లు
**శ్రీ యస్.వి.నాగేంద్రబాబు,**
**వాది పరం అడ్వకేట్,**
**గిద్దలూరు.**

ప్రజాశక్తి 3
ఆదివారం 4 జనవరి 2026

# సావిత్రిబాయికి ఘన నివాళి

**ప్రజాశక్తి- యర్రగొండపాలెం**

ముస్లిం యూత్ సొసైటీ ఆధ్వర్యంలో భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఇస్మాయిల్, సభ్యులు షేక్ చోటు, సయ్యద్ ముక్తియార్, షేక్ షరీఫ్, బీసీ నాయకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్థానిక రెయిన్‌బో హైస్కూల్, చైతన్య హై స్కూల్, బ్రిలియంట్ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు.. ఈ సందర్భంగా పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులందరూ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**చీమకుర్తి :** మండల పరిధిలోని పాటిమీద పాలెం ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఇస్తర్లపేడుకొండలు, మహిళా ఉపాధ్యాయులు వాకా కవిత, ఎం. విజయలక్ష్మి, ఆర్ఎన్. శివ కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కె. శిలార్, సంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అణగారి కులాల ఐక్యవేదిక జేఏసీ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొండలరావు, బండ్ల డేవిడ్, పి.గంగయ్య పాల్గొన్నారు.

**కొత్తపట్నం :** మండల పరిధిలోని ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిఫూలేకు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్ర బాయిఫూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్. చెంచు పున్నయ్య, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు చైతన్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

**కంభం :** స్థానిక సిఎల్ఆర్ డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ సయ్యద్ షా అలీ బాషా, అధ్యాపకులు గుండాల ముక్తేశ్వరరావు, ఏనుగుల రవికుమార్,షేక్ మౌలాలి, నారాయణ, ఆంజనేయులు, అరుణ, సాహిత్య,జ్యోతి పాల్గొన్నారు.

**ఉలవపాడు :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎం.శ్రీనివాసులు, దారా శ్రీనివాసులు, సాధన శివకుమార్, చిట్టా శ్రీనివాస్ రెడ్డి, మావులూరి బాబు, రేగలగడ్డ వెంకటసుబ్బయ్య, ఎ. శ్రీనివాసులు, పెదపట్టపు పాలెం పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, గణిత ఉపాధ్యాయురాలు డి.నీజర, పాఠశాల సెక్రటరీ సుదర్శి భాస్కరరావు, వి.మురళి, అశోక్, గాబ్రియల్ ,దాసరి బాలయ్య, జేమ్స్ శామ్యూల్, శరత్. జివిఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుధాకర్ బాబు, డాక్టర్ మాణిక్యరావు, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**గిద్దలూరు :** సావిత్రి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానం వద్ద ఉన్న సావిత్రి బాయిపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత, బీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఓ.వెంకటయ్య యాదవ్, జె.బాలయ్య యాదవ్, గిద్దలూరు పట్టణ బీసీ.సంక్షేమ సంఘ అధ్యక్షుడు అద్దంకి. మధుసూధనరావు, విశ్వ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు బంగారు శ్రీనివాసా ఆచారి, నీలోజి సురభయ్య ఆచారి, శాలివాహన నాయకులు సుండి వెంకట రమణ, దగ్గుపాటి శేఖర్, అద్దంకి జనార్దన్, కోటపాటి ప్రసాద్, వడ్లమూడి ఆంజనేయులు, పలుకురి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**కొనకనమిట్ల :** మండల పరిధిలోని వద్దిమడుగు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి పాఠశాల హెచ్ఎం.తాళ్లూరి నరసింహారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర, ఆమె చేసిన సేవలు, కషిని గూర్చి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రసూన్నదేవి, ప్రసాదరావు,పద్మజ,నందిని,భార్గవి, మల్లయ్య పాల్గొన్నారు.

**హనుమంతునిపాడు :** మండల పరిధిలోని మహ్మందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గుర్రం పెద్దిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పిసిపల్లి :** మండల పరిధిలోని మారెళ్ళ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి ఫూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.ఆదిలక్ష్మి, ముఖ్యఅతిథి కృష్ణారావు, ఎంఇఒ ఆర్. శ్రీనివాసులు, సర్పంచి పరిమి వెంకటరావు, ఉపాధ్యాయుడు మాధవరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బడుగు జనార్ధన్, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, సిఐటియు నాయకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**టంగుటూరు :** మండల పరిధిలోని కందులూరు గ్రామంలోని నిర్మల్ హైస్కూల్ సావిత్రిఫూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ ఇండ్ల ఏసుపాదం, ప్రిన్సిపల్ సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఐటియు ఆలిండియా బహిరంగ సభకు తరలిన కార్మికులు

**ప్రజాశక్తి-ఉలవపాడు**

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సిఐటియు ఆలిండియా 18వ మహాసభల సందర్భంగా ఆదివారం నిర్వహిస్తున్న ర్యాలీ, బహిరంగసభలో పాల్గొనేందుకు ఉలవపాడు, వలేటివారిపాలెం మండలాలకు చెందిన సిఐటియు నాయకులు, కారింకులు శనివారం బయలు దేరి వెళ్లారు. విశాఖపట్నం వెళ్లిన వారిలో సిఐటియు జిల్లా నాయకుడు జివిబి.కుమార్, సయ్యద్ గౌస్ బాషా, సాదు చెన్నకేశవులు, అంగన్‌వాడీ నాయకులు ఎ. తిరుపతమ్మ ,జి. ప్రవీణ, కె.కోటేశ్వరమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దువ్వూరి జాన్, ఏలూరు నాగార్జున, జువ్వికుంట వెంకటేశ్వర్లు, కరేడు పిటిపి యూనియన్ నాయకులు గుంజి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## 5న మండల సమావేశం

**ప్రజాశక్తి-టంగుటూరు**

టంగుటూరు మండల సర్వ సభ్య సమావేశం ఈ 5న ఎంపిపి పటాపంజుల కోటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ దేవసేన కుమారి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి పెద్ద దోర్నాల**

చెంచు గిరిజన సమస్యలను పరిష్కరించాలని మార్కాపురం జిల్లా చెంచు సంఘం నాయకుడు భూమని వెంకటేశం నంద్యాల జిల్లా సున్నిపెంలో రాష్ట్ర గిరిజన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం. మల్లికార్జున నాయక్‌ను కోరారు. తాగునీటి బోర్లు, వ్యవసాయ బోర్లు, గిరిజనులకు ఉపాధ్యాయ పోస్టులు, ఐటీడీఏ జనరల్ బాడీకి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

# వాకా వెంకట్రామిరెడ్డి మృతి

**ప్రజాశక్తి - మద్దిపాడు**

వైసిపి మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి తండ్రి, ఎంపిపి వాకా అరుణ మామయ్య వాకా వెంకట్రామిరెడ్డి అనారోగ్యంతో శనివారం మతి చెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న వైసిపి నాయకులు, రాజ్యసభ సభ్యుడు వైవి. సుబ్బారెడ్డి, ఆయన సోదరుడు వైవి.భద్రారెడ్డి దంపతులు వెంకట్రామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో వైసిపి ఒంగోలు ఇన్‌ఛార్జి చుండూరి రవి, బత్తుల బ్రహ్మానందరెడ్డి,బి.వెంకటేశ్వర్లు. కెవి. రమణారెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిప్తిపాటి శేఖరరెడ్డి, ఎన్.కృష్ణారెడ్డి, ఇనంగంటి పిచ్చిరెడ్డి, కొమ్మూరి కనకారావు మాదిగ, నాగులుప్పలపాడు ఎంపిపి నలమలపు అంజమ్మ, సంతనూతలపాడు జెడ్‌పిటిసి దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, పాకనాటి మహానందరెడ్డి, పల్లపాటి అన్వేష్, నాదెండ్ల మహేష్, కంకణాల నరేష్, పైడిపాటి వెంకట్రావు, బొమ్మల దాసు, బెజవాడ రాము, బొమ్మల రామాంజనేయులు, మేరుగ పద్మ, రాయపాటి విల్సన్, పులి వెంకటరెడ్డి, రాంబాబు, గద్దె జాలయ్య తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న ఎంపీ వైవి. సుబ్బారెడ్డి

# హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

**ప్రజాశక్తి- వెలిగండ్ల**

వెలిగండ్ల లోని ఎస్‌సి, బీసి హాస్టళు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని, వీటికి పక్కా భవనాలు ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి కోరారు. ఒంగోలు జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్‌పి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతిరెడ్డి పలు సమస్యలను లేవనెత్తారు. వెలిగండ్ల హాస్టల్లో గత 40 సంవత్సరాల నుంచి హాస్టళ్లు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని తెలిపారు. వాటి అర కొర వసతులు మాత్రమే ఉన్నాయన్నారుఉ. విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. మరుగు దొడ్లకు బయటికి పోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.

మాట్లాడుతున్న తిరుపతి రెడ్డి

## యువకుడికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

ఆటోను వెనుక నుంచి బైకు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండలోని కందుకూరు రోడ్డు వద్ద శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో స్థానిక అరుణ కాలనీకి చెందిన ఎస్‌కె. సాధిక్ అనే యువకుడికి గాయాలయ్యాయి. సాధిక్ బైకుపై శానంపూడి వెళ్లి తిరిగి వస్తూ ఆటోను ఢీకొన్నాడు. దీంతో సాధిక్ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎయిడెడ్ పాఠశాలల్లో తనిఖీ

**ప్రజాశక్తి-కంభం**

ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు లెక్కలను నిక్కచ్చిగా నిగ్గుతేల్చనున్నట్లు ఎంఇఒలు అబ్దుల్ సత్తార్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పలు ఎయిడెడ్ పాఠశాలలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల హాజరును భౌతికంగా, ఆన్‌లైన్ ,రికార్డు నమోదులో వ్యత్యాసాలను గుర్తించారు. వాస్తవ నివేదికలను రూపొందించారు. హాజరు లెక్కల్లో తేడా ఉన్న పాఠశాలలు తక్షణమే సరిచేయాలని , లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. నివేదికలను ఉన్నతాధి కారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

## ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి-కందుకూరు**

ఐటిఐ పూర్తి చేసి పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కందుకూరు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఎంవి. నాగేశ్వరరావు తెలిపారు.ఐటిఐ రెండేళ్ల కోర్సులో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణ సాధించిన వారికి ఈనెల 5 నుంచి ఫిబ్రవరి 4 వరకూ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణా కాలంలో ఎలాంటి భత్యం చెల్లించరని తెలిపారు. ఐటిఐ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశానిన సద్వినియోగం చేసుకోసుకోవాలని అయన కొరారు.పూర్తి వివరాలకు కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజిలో సంప్రదించాలన్నారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం :** మండల పరిధిలోని బిల్లగొంది, పోతురాజుపెంట గూడెంలలో నివసిస్తున్న గిరిజనులకు సమగ్ర గిరిజన అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అనుముల రవికుమార్, రైల్వే సూపరింటెండెంట్ గోపాలకష, రమేష్‌రెడ్డి, పల్లెపోగు వెంకటయ్య, హిందీ పండిట్ జయచంద్ర నాయక్, అబ్దుల్ కలాం, నూర్‌షావలి, సుర బాల రంగారెడ్డి, కొండేటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఎంపిడిఒ తనిఖీ

**ప్రజాశక్తి - కనిగిరి :** కనిగిరి మండలం తాళ్లూరు సచివాలయం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ షేక్ అబ్దుల్ ఖాదర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యా, మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పదవ తరగతి పరీక్షలపై చర్చించారు. విద్యార్థుల సామర్థ్యాలు, మార్కుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై అవగాహన

**ప్రజాశక్తి-టంగుటూరు**

రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని టోల్ ప్లాజా ప్రధాన అధికారి అమర్‌బాబు తెలిపారు. టంగుటూరు టోల్ ప్లాజా వద్ద 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టోల్ ప్లాజా వద్ద బ్లాక్ స్థలాలు, ద్విచక్రవాహనదారుల రక్షణ, అధిక స్పీడు, సెల్ వినియోగం గురించి వాహన చోదకులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, టోల్‌ప్లాజా సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

స్థానిక పర్చూరు రోడ్డులోని జనసేన కార్యాలయంలో మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దపూడి విజయకుమార్ 'ప్రజాశక్తి' క్యాలెండర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌కు ప్రత్యేకత ఉందని అన్నారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాసు పుస్తకాల్లో తప్పులు..

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తూ గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తున్న పొలం పాసు పుస్తకాలు, హక్కు పత్రాలు గత వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన తప్పులతడకగానే ఉన్నాయని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామ కోటేశ్వరరావు ఆరోపించారు. మాజీ సిఎం జగన్ ఫోటోతో కూడిన పాస్ పుస్తకాలు రద్దుచేసి, కూటమి ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నూతన పాస్ పుస్తకాలు రాజముద్రతో ముద్రించి పంపిణీ చేస్తున్నారని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పొలం పాస్ పుస్తకాల్లో కూడా ఆ తప్పులు అలానే ఉన్నాయని ఆరోపించారు. జాయింట్ ఎల్‌పీ నెంబర్లు, పేరు తప్పులు, పొలం విస్తీర్ణం హెచ్చు, తగ్గులు, అసైన్మెంట్ ల్యాండ్ల తప్పులు, చుక్కల భూములు, నిషిద్ధ భూములు తదితర తప్పులు అలానే ఉన్నాయని అన్నారు. పుస్తకం రంగు మార్చి జగన్ బొమ్మ తీసివేయటం తప్ప సవరణలు ఏమి జరిగినట్లు లేవన్నారు. పేరుకు గొప్పలు చెబుతూ పుస్తకాల్లో తప్పులు మాత్రం సరిచేసినట్లు లేవని అన్నారు. పంగులూరు, మార్టూరు మండలంలోని గ్రామాల్లో పుస్తకాలు పంపిణీ చేశారని, వాటిలో తప్పులు రైతులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో రైతులను కలిసి పొలాలు పరిశీలించి హక్కు పత్రాలు ధ్రువీకరణ పత్రాలు చూసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని కోరారు.

వివరాలు తెలుసుకుంటున్న కోఆర్డినేటర్ సత్యసాగర్

## పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి - యద్దనపూడి**

స్థానిక ఎంపిపి ఆదర్శ పాఠశాలను సమగ్ర శిక్ష జిల్లా ఎఎల్ఎస్ కో ఆర్డినేటర్ వి సత్యసాగర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు చేస్తున్న జాదూయి పిటారా బోధనా పరికరాలు, అమలవుతున్న భోధన విధానం, నో బ్యాగ్ డే కార్యక్రమం పరిశీలించారు. నో బ్యాగ్ డే సందర్భంగా స్మార్ట్ టివి ద్వారా బారిస్టర్ పార్వతీశం ప్రదర్శనను వీక్షించారు. పాఠశాలలో అమలవుతున్న 75 రోజుల జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం పరిశీలించారు. పాఠశాల రికార్డు పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. అపార్ నంబర్ల పురోగతి, వలసలు వెళ్లే కుటుంబాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ కార్నర్ పరిశీలించారు. కార్యక్రమంలో సుబ్బారావు, అనీల, ఆదిలక్ష్మి, రామతులశమ్మ, సిఆర్‌ఎంటి ఎం ప్రేమ కుమార్, మస్తాన్ వలి పాల్గొన్నారు.

## నేడు విత్తన డిపో ప్రారంభం

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

స్థానిక ఎఎంసి గోడౌన్లలో ఆదివారం జిల్లా సహకార మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ధరలతో రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ డిపో ఎంఎల్‌ఎ నక్కా ఆనందబాబుచే ప్రారంభించనున్నట్లు తెలిపారు. టిడిపి కార్యకర్తలు హాజరు కావాలని టిడిపి అధ్యక్షులు వాకాశేషు బాబు కోరారు.

# ఎమ్మెల్యేను కలిసి కలిసిన అధికారులు

**ప్రజాశక్తి - మార్టూరు**

నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆయన క్యాంపు కార్యాలయంలో బాపట్ల, చీరాల ఆర్డీఓలు పి గ్లోరియా, చంద్రశేఖర్, చిన్నగంజాం, మార్టూరు తహశీల్దార్లు జె ప్రభాకర రావు, ప్రశాంతి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కు పూల మొక్కలను బహూకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతూ ప్రజలకు సువరిపాలన అందించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శక పాలన అందించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు.

ఎంఎల్ఎ ఏలూరిని కలిసిన అధికారులు

# నిరాశ్రయులకు ఆర్థిక చేయూత

**ప్రజాశక్తి - మార్టూరు**

అగ్నిప్రమాదంలో ఇంటితో సహా సర్వం కోల్పోయి వీధిన పడిన కుటుంబానికి, దీర్ఘకాల క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు హెల్పింగ్ హాండ్స్ కమిటీ సభ్యులు చేయూత ఇచ్చారు. జొన్నతాళికి చెందిన చిట్టిబోయిన అంజయ్య, వెంకయమ్మ పూరిగుడిసె అగ్నికి ఆహుతవడంతో సర్వం కోల్పోయారు. కట్టుబట్టలతో మిగిలారు. వీరి పరిస్థితిని గమనించిన హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు పఠాన్ ఖాదర్ వలి కమిటీ సభ్యులతో కలిసి రూ.10 వేల ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు శనివారం అందజేశారు. రాజుపాలెం అసిస్ట్ కాలనీకి చెందిన గుంజి నాగేంద్రమ్మ క్యాన్సర్ వ్యాదితో బాధపడుతుండగా ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్ఐ హరిబాబు, కేబుల్ భాష, జాష్టి సాంబశివరావు, పుట్ట అయ్యప్ప స్వామి, సకల ఆంజనేయులు, బొల్లాపల్లి పోలు, తిరుమలశెట్టి శ్రీను, అమ్మ ఆశ్రమం చందు పాల్గొన్నారు.

సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

# గుంటూరు ఛానల్ పర్చూరుకు పొడిగించాలి

**ప్రజాశక్తి - పర్చూరు**

నల్లమడ ప్రాంతంలోని రైతాంగానికి సాగునీరు, ప్రజల తాగునీరు అందించేందుకు గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించాలని నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజ మోహన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన పర్చూరు లోని కొల్లావారి కళ్యాణ మండపంలో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వారు గుంటూరు ఛానల్ ను పెదనందిపాడు వరకు పరిమితం చేసి భూసమీకరణ చేస్తున్నారు తెలిపారు. ప్రాజెక్టు నందిపాడు వరకు పరిమితం చెయ్యడం వలన పర్చూరు ప్రాంతానికి త్రాగు, సాగు నీటికి తీరని నష్టం జరుగుతుందని విమర్శించారు. పర్చూరు వరకు పొడిగించే వరకు రైతు సంఘం తరపున పోరాటం తీవ్రతరం చేసేందుకు సమావేశంలో తీర్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల ఆరవ తేదీన స్థానిక బొమ్మల సెంటర్లో రైతులతో ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. రైతులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకమ్మ చౌదరి, గడ్డిపాటి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహారావు, రావి రమణయ్య చౌదరి, రావి రామనాథం బాబు, భ్రమరాంబ, జగన్నాథం, అడ్డగడ వెంకటేశ్వర్లు, పర్చూరు ప్రాంత రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహనరావు

# మండల సమావేశానికి అధికారులు డుమ్మా

**ప్రజాశక్తి - పంగులూరు**

మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజా సమస్యలేవీ సమావేశంలో చర్చకు రాలేదు. మొక్కు బడిగా సమావేశం నిర్వహించామని పించుకున్నారు. ఎంపిపి తేళ్ల నాగమ్మ అధ్యక్షతన స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు పూర్తి స్థాయిలో సమావేశానికి రాలేదు. తహశీల్దారు సింగారావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న బాపట్ల జిల్లా పేరును తొలగించి ఆ స్థానంలో ప్రకాశం జిల్లా పేరు రాయించాలని అధికారులకు సూచించారు. అలవలపాడు గ్రామానికి చెందిన నన్నేసా అనే రైతు గత 50ఏళ్లగా 484లో తనకు ఎకరా పొలం ఉందని, ఎప్పటి నుంచో అది పట్టాభూమిగా ఉందని, ఆ భూమి మీద ఈపాటికి బ్యాంకు రుణం, సొసైటీ రుణం తీసుకున్నానని చెప్పారు. అయితే రెవెన్యూ అధికారులు ఆ భూమిని ఆన్లైన్ నుండి తొలగించారని ఆరోపించారు. దీంతో బ్యాంక్ అధికారులు బ్యాంకు రుణం తీర్చమని తనపై ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు తక్షణమే తన పొలానికి ఆన్లైన్ చేయాలని కోరారు. ఈ అంశంపై తహశీల్దారు సింగారావు మాట్లాడుతూ 484 సర్వే నెంబరు చుక్కల భూమిగా ఉందని, ఆ భూమిని ఆన్లైన్ చేయటం వీలు కాదని చెప్పారు. సమావేశానికి ఎన్ఎస్‌పి అధికారులు, కార్మిక శాఖ అధికారులు, సోషల్ వెల్ఫేర్ అధికారులు, పంచాయతీరాజ్, పశుసంవర్ధక శాఖ అధికారులు, మరికొంతమంది అధికారులు హాజరు కాలేదు. దీంతో సమావేశం వెలవెల పోయింది. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఒ స్వరూప రాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దారు సింగారావు

గోవాడ దేవస్థాన కమిటీతో ఆనందబాబు

## ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

**ప్రజాశక్తి - అమృతలూరు**

మండలంలోని గోవాడ శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం, అభినందన సభ శాంతియుత వాతావరణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు నూతనంగా నియమితులైన ధర్మకర్తల మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ సంప్రదాయాలు, ఆచారాలు, ఆధ్యాత్మిక పరిరక్షణతో పాటు ఆలయ సమగ్ర అభివృద్ధిలో ధర్మకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ఆలయ వైభవాన్ని మరింత పెంపొందించే దిశగా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ పావులూరి రమేష్, సభ్యులు కాటం నాగేశ్వరరావు, రామదాసు శ్రీనివాసరావు, మడల అనంతలక్ష్మి, దేవీ హైమా ప్రియా, బన్నారావూరి ఆంజనేయులు, కొండవీటి లక్ష్మి బ్రహ్మారాంబ, మోపిదేవి లక్ష్మి, గండికోట పోలయ్య, అల్లూరి విజయకుమారి, అమృత లూరు బాబురావు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆలయ అర్చకులు, అధికార ప్రతినిధి ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న పుణ్య శ్రీనివాసరావు

## కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా 'శ్రీనివాసరావు'

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

ఎపి కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు బాధ్యతల ప్రమాణ స్వీకరణ మహోత్సవం తాడేపల్లిలోని ఆర్‌కె కన్వెన్షన్లో శనివారం నిర్వహించారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా నాదెండ్ల బ్రహ్మం చౌదరి ప్రమాణ స్వీకారం చేయగా భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందినమోటూరు పుణ్య శ్రీనివాస కుమార్ (చినబాబు) డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్ శ్రీనివాసరావుకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## జాతీయ పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి - బల్లికురవ**

మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బి భగత్ జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 6, 7 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేట ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జరిగిన పోటీల్లో భగత్ విశేష ప్రతిభ కనబరిచారు. ఈనెల 4, 5, 6, 7 తేదీల్లో జరిగే అండర్ 17 జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, పిఇటి కె రఘు రాముడు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, వికలాంగుల సంఘం అధ్యక్షుడు దమ్ము అంజయ్య అభినందించారు.

## ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానా

**ప్రజాశక్తి - సంతమాగులూరు**

మండలంలోని ఏల్చూరులో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్ గ్రామంలోని దుకాణా దారులకు పంచాయితీ తరఫున నోటీసులు శనివారం అందజేశారు. ఈ మేరకు పంచాయతీలో తీర్మానం చేశామని తెలిపారు.

## పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి-కందుకూరు**

కందుకూరు పట్టణంలోని సుల్తాన్ మోహిదీన్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుమారుడు ఇంటూరి సందీప్ జన్మదిన పందర్భంగా టిడిపి వార్డు కార్యదర్శి షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో పుస్తకాలు అందజేశారు. అనంతరం సందీప్‌కి జన్మదిన శుభాకాంక్షలు చెపుతూ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ రఫీ, ఆల్‌బాషా,ఎన్ మాల్యాద్రి, సుధ ,సత్యం తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఉగ్రను కలిసిన ఐటిడిపి నాయకులు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని యర్రగొండపాలెం నియోజకవర్గ ఐటీడీపీ సోషల్ మీడియా నాయకుడు షేక్ అజారుద్దీన్, పెద్దారవీడు మండల ఐటీడీపీ అధ్యక్షుడ భీమవరం ప్రసన్న మూర్తి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి పార్టీ పట్ల తమ అంకితభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.

## ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-కందుకూరు**

ఎస్‌టియు 2026 నూతన సంవత్సర క్యాలెండర్,డైరీని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియ యూనియన్ కందుకూరు జోన్ కన్వీనర్ గద్దగుంట వెంకటేశ్వర్లు, నాయకులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ు.ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చేతల వెంకటేశ్వర్లు, గవిని శివశంకర్, నాయకులు మేకల మోహనరావు, పతకమూరి కృష్ణయ్య, ఎం.మల్లికార్జున రావు, కొనిజేటి శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## మాలకొండను సందర్శించిన డిప్యూటీ కమిషనర్

**ప్రజాశక్తి-వలేటివారిపాలెం**

మాలకొండలోని శ్రీమాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామిస్వామి ఆలయాన్ని గుంటూరు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కెబి. శ్రీనివాసులు శనివారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. తొలత ఆలయ అధికారులు డిప్యూటీ కమిషనర్‌కు స్వాగతం పలికారు. అనంతరం డిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వమించారు. అనంతరం డిసి ఆలయ పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్స్ ఇఒ శ్రీనివాస్, కామేపల్లి ఆలయ ఇఒ బైరాగి చౌదరి, సూపరింటెండెంట్ సూపర్నెంట్ ప్రసాదు, జూనియర్ అసిస్టెంట్ మోహన్ రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

# వల్లూరమ్మ ఆలయంలో డాక్టర్ ఉగ్ర పూజలు

**ప్రజాశక్తి-టంగుటూరు**


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరశింహారెడ్డి వల్లూరమ్మ దేవాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వమించారు. తొలుత దేవాలయ బోర్డు బోర్డు చైర్మన్, ఆలయ వేద పండితులు డాక్టర్ ఉగ్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, టిడిపి. ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరశింహారెడ్డి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, గుత్తా వాసుకు దేవాలయ చైర్మన్ బొజ్జా శ్రీనివాసులు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూరారెడ్డిపాలెం సర్పంచి నర్రా శైలూషా, ఆలయ ఇఒ రమేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శనగ పంటను పరిశీలించిన వ్యవసాయ శాఖ కమిషనర్

**ప్రజాశక్తి-మద్దిపాడు**

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్

రెండేళ్ల నుంచి శనగలు కోల్డ్ స్టోరేజ్ లోనే ఉన్నాయని, దీంతో తాము అనేకఇబ్బందులకు గురవుతున్నాయని, శనగలను కొనుగోలు చేసి ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ మనాజీర్ జిలాని సమూన్ రైతుల కోరారు. మండల పరిధిలోని గుండ్లపల్లిలో రైతులు సాగు చేసిన శనగ పంటను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ శనగ, వివిధ పంటలకు పెట్టే పెట్టుబడి, దిగుబడి వివరాలను అడిగి లాభదాయకమైన పంటలు పండిస్తే వచ్చే నికర ఆదాయం గురించి వివరించారు. డిజిటల్ ఈ పంట నమోదు గురించి రైతులను గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులను అడిగి క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల పంటలకు మద్దతు ధర, పక తి విపత్తుల సమయంలో పంట నష్టపరిహారం అందుతుందని తెలిపారు. యూరియా సకాలంలో అందరికీ అందుబాటులో ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి శనగలు కోల్డ్ స్టోరేజ్ లోనే ఉన్నాయని తాము ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వ మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసి ఆదుకోవాని కోరారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలోని రైతులకు ఆయిల్ ఇంజన్, ప్రతి గ్రామానికి ఒక డ్రోన్, ట్రాక్టర్ సాగు చేసే పరికరాలు, వ్యక్తిగత పరికరాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎస్. శ్రీనివాసరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ బాబు, మార్కెఫెడ్ డిఎం , మండల వ్యవసాయ అధికారి జి. స్వర్ణలత, ఏఈఓ శేషారావు, విఏఏలు, రైతులు పి.సత్యనారాయణరెడ్డి, ఆర్. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - గిద్దలూరు**

అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల

ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆయనే తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. నివాస స్థలాలు, పక్కా గృహాలు, వికలాంగ, సామాజిక పెన్షన్లు మరియు పొలాలకు విద్యుత్ సమస్యలు, గ్రామాల్లోని సమస్యల పై ప్రజలు ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్

## రత్తమ్మకు ఎమ్మెల్యే నివాళి

**ప్రజాశక్తి - మద్దిపాడు**

మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో మార్నెని రత్తమ్మ దశదిన కర్మ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బిఎన్. విజయ్‌కుమార్ పాల్గొని రత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి రాష్ట్ర సెక్రటరీ ఆడక స్వాములు, మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు,మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, మల్లవరం శ్రీవారి ఆలయం చైర్మన్ మార్నెని రాఘవ, నాయకులు పోతినేని శ్రీనివాసరావు,గట్టినేని అయ్యన్న, దుగ్గినేని నరసింహారావు, ముప్పా రవి, కావూరి విజయ్ రాజు, నవులూరి శివకృష్ణ, రావూరి వెంకటేశ్వర్లు, గడ్డం రవి, వరహాలచౌదరి పాల్గొన్నారు.

ఎంపీ సుబ్బారెడ్డితో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

## ఎంపీ సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

రాజ్యసభ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు వైవి. సుబ్బారెడ్డిని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివద్ధి అంశాలు, ప్రజా సమస్యలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, త్రిపురాంతకం ఎంపిపి ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, నాయకులు ఆళ్ల ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎంపీ సుబ్బారెడ్డి

## వీరేపల్లి పద్మకు నివాళి

**ప్రజాశక్తి- కొత్తపట్నం**

కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామ వైసిపి సీనియర్ నాయకుడు విఆర్‌సి రెడ్డి సతీమణి వీరేపల్లి పద్మ దశదిన కర్మ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు వైవి. సుబ్బారెడ్డి, వైసిపి ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు పాల్గొని పద్మ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైసిపి నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ , డాక్టర్ మాదాసి వెంకయ్య , కసుకుర్తి ఆదన్న ,కెవి.రమణారెడ్డి , వై. వెంకటేశ్వర నాయుడు, పాలడుగు రాజీవ్ , శ్రీమన్నారాయణ , కటారి శంకర్ , లంకపోతు అంజిరెడ్డి, ఆళ్ల రవీంద్రర్ రెడ్డి , దుంపా చెంచిరెడ్డి తదితరులు ఉన్నారు.

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న డాక్టర్ ఉగ్ర

డాక్టర్ ఉగ్ర ప్రమాణస్వీకారానికి హాజరైన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

మంత్రి స్వామితో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

## అట్టహాసంగా డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రమాణ స్వీకారం

డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

# పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని వేమవరంలో ప్రభుత్వ రాజముద్రతో ఉన్న పాస్ పుస్తకాల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరుతుందని తహశీల్దారు రవి నాయక్ అన్నారు. భావితరాల రైతుల వారసులకు సైతం ఏ విధమైన సమస్యలు లేకుండా సిఎం చంద్రబాబు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నూతన పాస్ పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో భూ సమస్యలకు తావు లేకుండా రైతులకు ప్రభుత్వం రీ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపిందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 685 మంది రైతులకు నూతన పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టిపాటి మారుతి, విఆర్ఒ రవి ఉన్నారు.

**ముండ్లమూరు :** అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయనున్నట్లు డిప్యూటీ తహశీల్దారు రావూరి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని తూర్పు కంభం పాడు పరిధిలోని భట్లపల్లిలో ఆయన 399 పట్టాదార్

పాస్‌బుక్ అందజేస్తున్న తహశీల్దారు రవినాయక్

పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో ప్రభుత్వం అర్హులైన ప్రతి రైతుకు పాత పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకొని రాజముద్రతో ముద్రించిన కొత్త పాస్ పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ఎ తిరుమలరావు, ఎంపీటీసీ తేలుకుట్ల బ్రహ్మం, టిడిపి మండల అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, టిడిపి దర్శి పట్టణ అధ్యక్షులు పుల్లలచెరువు చిన్న, చాగంటి హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షులు ఉన్నం పరిపూర్ణయ్య పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న నాయకులు

## సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - సంతమాగులూరు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు తెలుగుదేశం మండల అధ్యక్షులు చేవూరి వాసురెడ్డి సంతమాగులూరు మాజీ సర్పంచి అల్లడి రాములుకు రూ.30,766, మెరుగుమల్లి రవికి రూ.23,920 విలువైన చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పరిహారం అందిస్తున్న సీఆర్పీ ఫెడరేషన్ అధ్యక్షులు గద్దె రమేష్

## పరిహారం అందజేత

ప్రజాశక్తి - పంగులూరు

గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మరణించిన సిఆర్పి మట్ట కొయ్యామోషే కుటుంబానికి సమగ్ర శిక్ష తరుపున రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియాను అధికారులు శనివారం అందించారు. మండలంలోని రేణింగవరంకు చెందిన మట్ట కొయ్య మోషే స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సిఆర్పిగా పనిచేసేవాడు. గతేడాది జులైలో రేణింగవరం హైవే వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని కుటుంబాన్ని సర్వ శిక్ష అధికారులు శనివారం పరామర్శించి రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా, యూనియన్ తరపున సమీకరించిన ఆర్థిక సహాయాన్ని ఆయన భార్యకు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష బాపట్ల ఎఫ్ఎఒ సైదావలి, ఎఎంఒ మోజేష్, సిఆర్పి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గద్దె రమేష్ పాల్గొన్నారు.

నివాళులర్పించిన వరికూటి అశోక్ బాబు

## యేసు దయమ్మకు నివాళి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరుకు చెందిన వైసిపి నాయకులు గుంటూరు శ్రీనివాసరావు భార్య యేసుదయమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె సంస్మరణ సభ సందర్భంగా వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## ఈతకెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని వేలమూరిపాడు సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం వంతెన నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఈ ప్రాంతంలో పనుల నిమిత్తం వచ్చిన యువకుడు రెండు రోజుల క్రితం ఈతకు దిగిన యువకుడు గల్లంతయ్యాడు. సిఐ ఆరాధ్యులు సుబ్బరాజు గాలింపు చర్యలు చేపట్టి శనివారం సాయంత్రానికి మృతుడిని గుర్తించి వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని అద్దంకి, దర్శి రోడ్డులో వేంపాడు వద్ద శుక్రవారం అర్ధరాత్రి పొదిలి మండలం సూదులగుంటకు చెందిన నర్సిరెడ్డి, మణికంఠ ద్విచక్ర వాహనంపై అద్దంకి నుండి దర్శివైపు వెళుతూ వేంపాడు వద్ద మినీ లారీని ఢీ కొట్టారు. ప్రమాదంలో నర్సిరెడ్డి, మణికంఠకు స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ కె కమలాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - పంగులూరు

యుక్త వయసు వచ్చేవరకు మగ పిల్లలు కానీ, ఆడపిల్లలు కానీ వివాహాలు చేయవద్దని, బాల్య వివాహాలకు పాల్పడితే కఠినమైన శిక్షకు బాధ్యులు అవుతారని అద్దంకి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల సూచించారు. మండలంలోని ముప్పవరంలోని శ్రీ పాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ ఉన్నత పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మగ పిల్లలకు 21ఏళ్లు, ఆడపిల్లలకు 18ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని చెప్పారు. బాగా చదువు కోవాలని, మంచి భవిష్యత్తు పొందాలని అన్నారు. అప్పుడే వివాహాలు చేసుకోవాలని అన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసుకుంటే తమ

మాట్లాడుతున్న జడ్జి అఖిల

దృష్టికి తీసుకురావాలని కోరారు. బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు టీఎం శ్రీను, ఎం ప్రకాష్, ఎస్‌కెఎం రఫీ, న్యాయవాది ధనుంజయ, హెచ్ఎం పి ప్రసాదు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

ప్రజాశక్తి - అమృతలూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి మేళ శనివారం నిర్వహించారు. ఎంపిడిఒ మారుతి శేషమాంబ, స్కిల్ కాలేజీ డిడియు జికెవై ప్రాజెక్టు మేనేజర్ రమేష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపికకు 100 మంది యువకులు పాల్గొన్నారు. వీరి అర్హతను బట్టి శిక్షణ ఉంటుందని, అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, ఏకరూప దుస్తులు, ఎన్‌ఎస్‌డిసి సర్టిఫికెట్ ఇచ్చి వారి నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు

మాట్లాడుతున్న ఎంపిడిఒ మారుతి శేషమాంబ

చెప్పారు. మేళకు రానివారు కూడా ఆదివారం నేరుగా తెనాలి బుర్రిపాలెంలోని ట్రైనింగ్ సెంటర్‌కు రావాలని కోరారు. పూర్తి వివరాలకి ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ ఫోన్ నెంబరు 99599 15182, 9100781689 సంప్రదించాలని చెప్పారు.

## మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రజాశక్తి - అద్దంకి

అదనపు కట్నం కోసం భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నట్లు పట్టణానికి చెందిన హర్షిత అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శావల్యాపురం మండలం వేల్పూర్ గ్రామానికి చెందిన మహేష్‌తో కొంత కాలం క్రితం వివాహం చేయగా కొంతకాలం కాపురం సజావుగా జరిగినప్పటికీ ఆ తర్వాత భర్త, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు పెడుతు న్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

## 5న అవగాహన సదస్సు

ప్రజాశక్తి - మార్టూరు

రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న మార్టూరు మార్కెట్ యార్డులో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి శనివారం తెలిపారు. 6న మండలంలోని వివిధ గ్రామాల్లో పంట పొలాలు పరిశీలించి సస్యరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరిస్తారని తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్‌కె కాలేషావలి

## కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ ఎంబిఎ విద్యార్థులకు నీడ్ ఫర్ కమ్యూనికేషన్ స్కిల్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. అతిధి అధ్యాపకులు ఎస్‌కె కాలేషా వలి విద్యార్థులకు అవగాహన కల్పించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. ఇంటర్వ్యూలలో ఫెయిల్ అవడానికి ఎలాంటి అవరోధాలు ఉంటాయి, వాటిని అధిగమించడానికి కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా దోహద పడతాయో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ ఆర్ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న మల్లికార్జునరావు

## ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని కూచినపూడి పిహెచ్‌సి పరిధిలోని గరువుపాలెం, ప్రజ్ఞం పంచాయతీల్లోని హెల్త్ అండ్ హెల్నెస్ సెంటర్లను టాస్క్ ఫోర్స్ టీమ్ అధికారులు సిహెచ్ఒ మల్లికార్జునరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పేదల ఆరోగ్యం రీత్యా ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండి వైద్యం అందించాలని అన్నారు. అధికారులు అందించే ఆరోగ్య కార్యక్రమాలు, ఆఫీసు రికార్డులను పరిశీలించారు. హెచ్ఎంఐఎస్ హెల్త్ మేనేజ్మెంట్ సమాచార వ్యవస్థలో కొట్టేసిన వివరాలు పరిశీలించి ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. డిస్ట్రిక్ట్ లక్ష్మణ్, ఎంపిహెచ్ఇఒ సాంబశివరావు, పిహెచ్ఎన్ లక్ష్మీ, విహెచ్ మాధవి పాల్గొన్నారు.

## యర్రంవారిపాలెంలో గ్రామసభ

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని యర్రంవారిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం స్వామిత్వ గ్రామ సభ శనివారం నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ వి రామ మోహనరావు మాట్లాడారు. సర్వే వివరాలు గ్రామ సభలో చర్చించి ఆస్తి కార్డుల జారీ ప్రక్రియలో గ్రామ ప్రజల అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ లింగిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

## బ్రహ్మం మృతికి సంతాపం

ప్రజాశక్తి - పర్చూరు

బ్రహ్మం

మండలంలోని చిన్నందిపాడు మాజీ ఉప సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు కొత్త బ్రహ్మం మృతి పట్ల శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శనివారం సంతాపం తెలిపారు. బ్రహ్మం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంచి వ్యక్తిని కోల్పోయామని అన్నారు. టిడిపికి, ఆయన కుటుంబ సభ్యులకు తీరని లోటని అన్నారు.

## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రేపల్లె

జడ్జి వెన్నెల

న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 14న 2వ శనివారం స్థానిక న్యాయ స్థానంలో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పిడి వెన్నెల తెలిపారు. రేపల్లె సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులు, రాజీ పడదగిన పరిష్కారం కాని కేసుల వివరాలు సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ రాజశేఖర్, చెరుకుపల్లి ఎస్ఐ అనిల్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జివి గిరిధర్ పాల్గొన్నారు.

## ఒంగోలులో రెవెన్యూ క్లినిక్

ప్రజాశక్తి - బల్లికురవ

రవి నాయక్

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం ప్రతి సోమవారం ఒంగోలు కలెక్టరేట్లో రెవెన్యూ క్లినిక్‌ను ఏర్పాటు చేసిందని తహశీల్దారు రవి నాయక్ తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడారు.

**అద్దంకి :** మండలంను ప్రకాశం జిల్లాలో విలీనం చేయడంతో సోమవారం జరిగే రెవెన్యూ క్లినిక్ (పిజిఆర్ఎస్) కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని, అర్జీదారులు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ప్రజలు తమ అర్జీలు దాఖలు చేసుకోవచ్చని తహశీల్దారు జి శ్రీ చరణ్ తెలిపారు.

## ఎపిని పెట్టుబడుల ప్రదేశ్‌గా మార్చిన చంద్రబాబు

**ప్రజాశక్తి-దర్శి**

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

నాడు రాష్ట్రం నుంచి పరిశ్రమలు, పెట్టుబడి దారులు పలాయనబాట పడితే నేడు పరుగున వచ్చేందుకు పోటీ పడు తుండటం ప్రగతి సాధకు డైన చంద్రబాబు నాయుడి పాలనా దక్షతకు నిదర్శన మని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల ప్రదేశ్‌గా, సన్ రైజ్ స్టేట్‌ను ఇన్వెస్ట్మెంట్స్, ఎంప్లాయ్‌మెంట్‌కు కేరాఫ్‌గా మార్చిన ఘనత చంద్రబాబు, లోకేశ్ దేనన్నారు. ఇరువురి నిర్విరామ కృషి వల్లే ఎఐ టెక్నాలజీ, క్వాంటమ్ ఆవిష్కరణలతో పాటు, ఐటీ ఇతర రంగాల దేశీయ పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ దేశంలో మేటి గా నిలిచిందన్నారు. 18 నెలల్లో రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 26 లక్షల ఉద్యోగావకాశాలు రావడం విజనరీ నాయకుడి వినూత్న పాలనా సంస్కరణల ప్రతిఫ లమే అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన పారిశ్రా మిక విధానం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్, ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్సులు ప్రపంచ పారిశ్రా మిక వేత్తల దృష్టిని ఏపీవైపు మళ్లేలా చేశాయని అన్నారు.

## ఉపాధి హామీ చట్టంపై శిక్షణ

**ప్రజాశక్తి-దర్శి**

స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం" స్థానంలో కొత్తగా వచ్చిన విక్షిత్ భారత్, గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)– 2025 బిల్లు పై దర్శి సబ్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు, మహిళా రైతులు, సర్పంచులకు కెవికె హెడ్ డాక్టర్ జి రమేష్ అవగాహన కల్పించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రజలకు రక్షణ కవచంగా నిలచిందన్నారు. కానీ ప్రస్తుతం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సమూలంగా మారిపోయిందని అన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి 125 రోజుల పని హామీ, స్థానిక ప్రణాళిక, సుస్థిర ఆస్తుల నిర్మాణం, మెరుగైన పరిపాలనపై దృష్టి పెట్టుకునట్లు వివరించారు. ఈ పథకం ద్వారా 100 రోజుల నుండి 125 రోజులకు పని పొడిగిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీని పెంచి, గ్రామీణ అభివద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి మానస, టి వేంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## 5 నుంచి గ్రామ సభలు

**ప్రజాశక్తి - కారంచేడు**

ఉపాధి హామీ చట్టంపై ఈనెల 5నుండి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె నేతాజీ శనివారం తెలిపారు. ఎంజిఎన్ఆర్ఇజిఎ చట్టంలో సంస్కరణలు చేస్తూ రూపొందించిన కొత్త ఉపాధి హామీ చట్టం, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ఉపాధి, మౌలిక వసతులు, జీవనోపాధిని బలోపేతం చేయడం దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఈనెల 5న మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**చిన్నగంజాం :** ఉపాధి హామీ పథకంపై ఈనెల 5 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె ధనలక్ష్మి తెలిపారు. ఎంజిఎన్ఆర్ఇజిఎ చట్టంలో సంస్కరణలు చేస్తూ రూపొందించిన కొత్త ఉపాధి హామీ చట్టం, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ఉపాధి, మౌలిక వసతులు, ఉపాధిని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

## ఆటిజం సెంటర్‌కు స్థల పరిశీలన

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 175 ఆటిజం సెంటర్లను ప్రారంభించేందుకు జిల్లా స్థాయి కో ఆర్డినేటర్ ఎం జ్యోత్స్న ఇంకొల్లులో పిఎంశ్రీ ఉన్నత పాఠశాలలో స్థలం శనివారం పరిశీలించారు. ఇంటి వద్దనే విద్య కార్యక్రమంలో భాగంగా షేక్ మునిబ అనే పాప ఇంటికి వెళ్లి పరిశీలించారు. తల్లిదండ్రులకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ సామ్రాజ్యం, ఎ శ్రీనివాసరావులు, హెచ్ఎం జి బాలకృష్ణ, ఐఆర్‌పి హరిబాబు పాల్గొన్నారు.

# చదువుల తల్లి సావిత్రిబాయికి నివాళి

సావిత్రిబాయికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి - అద్దంకి**

మండలంలోని బొమ్మనంపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సిహెచ్‌వి శ్రీనివాసమూర్తి మాట్లాడారు. మనువాద భావజాలంతో నిండిన ఆనాటి సమాజంలో ఆమె భర్త మహాత్మా జ్యోతిరావు పూలే మార్గదర్శకత్వంలో చదువుకు దూరమైన వర్గాలు, మహిళలకు పాఠశాలలు స్థాపించి చదువు చెప్పడమే కాకుండా సమాజంలో మార్పు కోసం పోరాటం చేసిన మహనీయురాలని అన్నారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు చక్రపాణి యాదవ్, తెలుగు ఉపాధ్యాయులు జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, ఉపాధ్యాయులు షేక్ హజ్రత్ అలీ, దామా నాగేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, పొత్తూరి వెంకట్రావు, కె సుబ్బారావు, కెఎన్‌జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**కారంచేడు :** రెండు శతాబ్దాల క్రితమే చదువు విలువ గుర్తించి మహిళలకు విద్య నేర్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సిహెచ్ సరోజిని అన్నారు. సావిత్రిబాయి పూలే 197వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావులూరి శ్రీనివాసరావు, సిహెచ్ పద్మావతి, సిహెచ్ మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

**ముండ్లమూరు :** స్థానిక కెజిబివిలో సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా ప్రత్యేక అధికారిని ఆవుల సునీత తెలిపారు. డిబిఆర్‌సి ఆధ్వర్యంలో జరిగిన డిబిఆర్‌సి ఏరియా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడారు.

**సంతమాగులూరు :** మహిళా అభివృద్ధికి సావిత్రిబాయి పూలే తొలిమెట్టని ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్ అన్నారు. స్థానిక విద్యా వనరుల కేంద్రం ఆవరణలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా 3, 4, 5 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మామిళ్ళపల్లి పాఠశాల 5వ తరగతి విద్యార్థిని కె చైత్ర సావిత్రిబాయి వేషధారణలో ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఎంపిపి ఎనుబర్ల యలమంద, టిడిపి మండల అధ్యక్షులు చేవూరి వాసురెడ్డి, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, అట్లా పెద్ద వెంకటరెడ్డి, పి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు రెహనా, విజయ కుమారి, సుజాత, విజయలక్ష్మి, ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావు, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

**దర్శి :** సావిత్రిబాయి పూలే జయంతి చిత్రపటానికి పూలమాల వేసి టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఘన నివాళి అర్పించారు. సావిత్రిబాయి పూలేకు ఆధునిక మహిళలు కృతజ్ఞతలు తెలపాల్సి ఉందన్నారు. స్థానిక మెప్మా కార్యాలయ ఆవరణంలో దళిత, బిసి సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతి సభ బీసీసంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరం వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంఇఒ మాలకొండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, అన్నవరపు వెంకటేశ్వర్లు, జివి రత్నం, రాచపూడి మోషే, దొంతులూరు కోటేష్, గర్నెపూడి యాకోబు, గోపాలుని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

**తాళ్ళూరు :** మండలంలోని వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాలలో 'జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం' సావిత్రిభాయి పూలే 195వ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎస్ఎంసి చైర్మన్ ఆలూరి రమేష్, వైస్‌చైర్మన్ జనరాజుపల్లి నాగమణి తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు వరకాల మస్తాన్ పాల్గొన్నారు.

**భట్టిప్రోలు :** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఎంపీపీ డివి లలిత కుమారి, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణలు పూల మాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్తు పరిపాలన అధికారి సిహెచ్ జలజ, పి ఆర్ ఏఈ రామచంద్రరావు, నాయకులు నాగమల్లేశ్వరరావు

ముండ్లమూరు కెజిబివిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

పూల మాల వేస్తున్న భట్టిప్రోలు ఎంపిపి లలిత కుమారి

# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన దిగుబడి

మాట్లాడుతున్న ఎస్ రామ్మోహనరావు

**ప్రజాశక్తి - ముండ్లమూరు**

స్థానిక రైతు సేవా కేంద్రంలో ఒంగోలు వనరుల కేంద్రంలో 2వ రోజు రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ నిర్వహించారు. డిఆర్‌సి ఎడిఎ ఎస్ రామ్మోహన్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీ య పద్ధతులు అలవర్చుకోవాలని కోరారు. భూమిలోని సేంద్రీయ కర్బన శాతాన్ని పెంచి నేలను ఆరోగ్యవం తంగా చేయొచ్చని తెలిపారు. ఎపిసిఎన్ఫ్ రిసోర్స్ పర్సన్ ఎస్‌కె కరీమునిషా ప్రకృతి వ్యవసాయంలో పాటించా ల్సిన 9 సూత్రాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయం లో పిఎండిఎస్ సాగు, ఎటిఎం మోడల్, వరిలో ఎ గ్రేడ్ నమూనా గురించి వివరించారు. ఎఒ తిరుమలరావు మాట్లాడుతూరైతులు రబి పంట కాలంలో వేసిన పంటలు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విఎఎ వీరాంజనేయులు, ఎఫ్ఎంటిలు కోటయ్య, ప్రభాకర్, మురళి, యోగేశ్వరమ్మ, సుబ్బారావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

**తాళ్ళూరు :** ప్రకతి వ్యవసాయంపై అవగాహన కల్పించుకొని మంచి దిగుబడి సాధించాలని దర్శి ఎడిఎ కె బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని తూర్పుగంగవరంలో ప్రధాన మంత్రి రైతు కిసాన్ యోజన పథకంపై ఎఒ బి ప్రసాదరావు అధ్యక్షతన అవగాహన కల్పించారు. రైతులకు ప్రకతి వ్యవసాయంపై ఒంగోలు రీసెర్చ్ పర్సన్ జి శిరీషరెడ్డి అవగాహన కల్పించారు. ఎఒ శేషమ్మ రైతులకు జీవన ఎరువుల వాడకం, ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో డి సుప్రజ పాల్గొన్నారు.

వ్యవసాయ దీపికలు అందజేస్తున్న ఎడిఎ బాలాజీ నాయక్

హార్బర్‌లో దగ్ధమవుతున్న బోటు

## షార్ట్ సర్క్యూట్‌తో బోటు దగ్ధం

**ప్రజాశక్తి - నిజాంపట్నం**

స్థానిక హార్బర్‌లో బోటు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో బోటు పూర్తిగా కాలిపోయింది. సున్నంపూడి గోవింద రాజుకు చెందిన ఎంఎం 10 (ఎఫ్ఎన్‌జెడ్ఎం 316) నంబర్ గల బోటు సముద్రంలో వేటకు బయలు దేరేందుకు సిద్ధమవుతుండగా బోటు డ్రైవర్ ఇంజిన్ స్టార్ట్ చేయగానే ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. బోటులో డీజిల్ నిల్వలు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి బోటు దగ్ధమైంది. ప్రమాదంలో బోటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా అతడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథ్ బాబు, బోటు యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బోటు ఓనర్‌ను పరామర్శించారు. జరిగిన ఘటనపై మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు, సివిల్, మెరైన్ పోలీస్‌లు వివరాలు సేకరిస్తున్నారు.

## విఒఎలకు శిక్షణ

**ప్రజాశక్తి - అద్దంకి**

స్థానిక మండల సమాఖ్య నందు సీడ్ క్యాపిటల్‌పై అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాలకు సంబంధించి సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులు, విఒఎలు, సీసీలు, అకౌంటులకు ఎపిఎంఎస్ శిక్షణ ఇచ్చారు. సీడ్ క్యాపిటల్ ఉపయోగం ఉద్యమ ఆధార్ ఫస్సయ్ గురించి వివరించారు. ఈఎపిఎం ఎల్‌హెచ్ కె రవికుమార్, డిఆర్ పి రవీంద్రబాబు, రిసోర్స్ పర్సన్స్ డి సురేష్, పి ప్రమీల, ఎపిఎం జ్యోతి ప్రసాద్, సంతమాగులూరు ఎపిఎం పి హనుమంతరావు పాల్గొన్నారు.

## మత్స్యకారుడి మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి - నిజాంపట్నం**

ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుడు ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందాడు. నిజాంపట్నంకు చెందిన పీత పానకాలు (49) శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. తన బోటులోని కింద ఉన్న ఫ్యాను పరిశీలించేందుకు హార్బర్ జెట్టీ సమీపంలోని కాలవలోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. దీంతో మత్స్యకారులు, గజ ఈతగాళ్ల సహాయంతో విస్తృతంగా గాలించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అతను మునిగిపోయిన ప్రదేశానికి సమీపంలోనే నీటిపై తేలియాడుతూ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య పీత నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కందుల తిరుపతిరావు తెలిపారు.

## ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాలి

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

జనసేన నాయకులు, కార్యకర్తలు పార్టీని అభివృద్ధి చేసుకుంటూనే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనా లని మాల కార్పొరేషన్ చైర్మన్, జనసేన రాష్ట్ర కార్యదర్శి పెదపూడి విజయకుమార్ అన్నారు. స్థానిక పర్చూరు రోడ్డులో జనసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి కార్యకర్తలకు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన ఉపముఖ్య మంత్రి, జనసేన అధ్యక్షులైన కె పవన్ కళ్యాణ్ ఆశయం మేరకు పనిచేయాలని అన్నారు. సమస్యలేమైన ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పెళ్లూరి వీరాంజనేయులు, గుది బుచ్చిబాబు, పెళ్లూరి శివరామకృష్ణ, చేబ్రోలు అనిల్ పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి ఆర్‌ఎంగా సత్యనారాయణ

**ప్రజాశక్తి-మార్కాపురం**

ప్రెస్‌మీట్‌లో ఆర్‌టిసి ఆర్‌ఎం సత్యనారాయణ

ఎపిఎస్‌ఆర్‌టిసి మార్కాపురం ఇన్‌చార్జి ఆర్‌ఎంగా జి సత్యనారాయణ శని వారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు స్థానిక ఆర్‌టిసి డిపోలో ఎపిఎస్ ఆర్‌టిసి రీజనల్ కార్యాలయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్‌ఎం సత్యనారాయణతోపాటు ఆర్‌టిసి జోన్-3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్టాండులో ఫ్లాట్ ఫారాల సంఖ్య పెంచుతామన్నారు. మరుగుదొడ్లు, మూత్ర విసర్జన శాలల సంఖ్య పెంచుతామన్నారు. మార్కాపురం జిల్లా పరిధిలో నాలుగు డిపోలు ఉన్నాయన్నారు. మొత్తం 320 బస్సులు ఉన్నట్లు చెప్పారు. శ్రీశైలం ప్రయాణికుల కోసం 11 బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో మార్కాపురం డిపో మేనేజర్ ఎవిఎస్ నరసింహులు పాల్గొన్నారు.

పరిశీలనలో కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యేలు

## సిఎం పర్యటన వాయిదా

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల, మార్కాపురం**

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన సొరంగ మార్గాల పనులతో పాటు ఫీడర్ కెనాల్ పనుల పరిశీలన నిమిత్తం పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు గ్రామ సమీన గల వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు సిఎం చంద్రబాబు నాయుడు వస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ నెల 7న సిఎం పర్యటన ఉంటుందని ప్రకటించారు. సిఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లకు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో పాటు జిల్లా ఎస్‌పి వి హర్షవర్ధన్‌రాజు, జలవనరు శాఖ, వెలిగొండ ప్రాజెక్టు ఉన్నతాధికారులు శనివారం వెలిగొండ పనుల ప్రదేశాన్ని పరిశీలించారు. వారితో పాటు మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, టిడిపి కీలక నేతలంతా వెలిగొండ పర్యటనలో ఉన్నారు. సిఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లకు సంబంధించి అధికారులను పురమాయించారు. పశ్చిమ ప్రాంత టిడిపి ఎమ్మెల్యేలు కూడా సిఎం చంద్రబాబు పర్యటన విజయవంతం అయ్యేలా ప్రయత్నాలు మొదలుపెట్టారు. మార్కాపురం జిల్లా ఆవిర్భవించిన తరువాత మొదటిసారిగా వస్తున్న నేపథ్యంలో టిడిపి శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ప్రధానంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి టిడిపి క్యాడర్‌తో మార్కాపురం పట్టణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఓ వైపు సిఎం పర్యటన ఏర్పాట్లు ప్రారంభం కాగా.. అంతలోనే సిఎం చంద్రబాబు పర్యటన వాయిదా పడినట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు మార్కాపురం సబ్‌కలెక్టర్ మాదాళ వెంకట శివరామిరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సిఎం పర్యటన వాయిదా పడిందని వెల్లడించారు.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**

మహిళా విద్యకు, సమాజ సంస్కరణకు, తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెను స్మరించుకుంటూ శనివారం స్థానిక మండల టీడీపీ కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిఎన్‌టియుసి మండల అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు మాధవీలత, జిల్లా డైరీ మాజీ డైరెక్టర్ చెరుకూరి బోస్, టీడీపీ నాయకులు ఏ మాధవ, గుర్రం శ్రీనివాసరావు, బక్కా ఎలమంద, అంజయ్య తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

# ఉపాధి హామీ చట్టం సిపిఎం ఘనతే..

- బిలియనీర్లుగా ఎదిగిన వైఎస్, చంద్రబాబు రాష్ట్రాన్ని దివాలా తీయించారు
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ చింతా మోహన్

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

మాట్లాడుతున్న చింతామోహన్

ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, దానికి మద్దతిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్వీర్యం చేస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతామోహన్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ఒంగోలులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నేటి పాలకులు ఖాళీ కాగితంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం కామ్రేడ్ హరికిషన్‌సింగ్ సూర్జిత్ ఆలోచనగా రూపుదిద్దుకున్నదని గుర్తుచేసిన చింతామోహన్ ఢిల్లీ 8, తీన్‌మూర్తి రోడ్డులోని ఆయన నివాసంలో ఈ చట్టానికి పునాది పడిందన్నారు.

తాను ప్రతి ఇంటికి రెండు పాడి గేదెలు కొనిచ్చే ప్రతిపాదన తేగా సూర్జిత్, ప్రకాష్ కరత్ ఉపాధి చట్టం కోసం పట్టు పట్టారన్నారు. ఈ చట్టం అమలు ఘనత అటు సిపిఎంకు, ఇటు కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని అన్నారు. గ్రామీణ నిరుపేద కుటుంబాలకు సంవత్సరానికి కనీస ఉపాధి, ఆదాయ భరోసా కల్పించడమే ఈ చట్ట లక్ష్యమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధులు రాష్ట్రాలే భరించాలంటూ ఆదేశాలు ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాలు ఈ నిధులు ఎలా సమకూర్చుతాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్, మెస్ బిల్లు, ఫీజులు పాకెట్ మనీ ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం బటన్ నొక్కుడుకు, చంద్రబాబు ప్రభుత్వం పెన్షన్లకు మళ్లించి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నట్లు చెప్పారు. రెండెకరాల రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ఫలితంగా బిలియనీర్‌గా ఎదిగారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి కూడా సామాన్య కుటుంబంలో పుట్టి ప్రజల సంపదను దోచుకుని బిలియనీర్లుగా ఎదిగి ప్రజలను అప్పుల ఊబిలో నెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన పూర్తి స్థాయి స్కాలర్‌షిప్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయేంద్ర మహాజన్ పాల్గొన్నారు.

# కిమ్స్‌లో కేన్సర్‌కు అధునాతన సేవలు

### 5నుంచి మూడు రోజుల పాటు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

కిమ్స్‌లో కేన్సర్ యూనిట్

క్యాన్సర్ వ్యాధి మహమ్మారిలా ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. వ్యాధిని గుర్తించే లోపు వ్యాధి నివారణ చేయి దాటి పోవడం, వ్యాధిని గుర్తించినా సమగ్ర వైద్య సేవలకు చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ వంటి దూరప్రాంతాలకు వెళ్లడం ఖర్చుతో పాటు, శ్రమతో కూడుకున్న ప్రక్రియగా పరిణమిస్తుంది. ఈ కారణాలు ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలకు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురిచేస్తున్నాయి. ఈ తరుణంలో ఒంగోలు కిమ్స్ సూపర్ స్పెషాలిటీ యాజమాన్యం ఈ వ్యాధిని గుర్తించడం, సరైన ఆధునిక వైద్యసేవలు ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసులకు అందుబాటులోకి తేవడం విశేషం. కిమ్స్ హాస్పిటల్ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యాన్సర్ బ్లాక్‌ను ఏర్పాటు చేయడం జిల్లా ఒక వైద్య రంగంలో కీలక మార్పుగా నిలవనుంది.

**ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు..**

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తగ్గుతుందన్న వైద్య సూత్రాన్ని దష్టిలో ఉంచుకొని జనవరి 5, 6, 7 తేదీల్లో ఉచిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు కిమ్స్ డైరెక్టర్ గిరినాయుడు, సిఇఓ కె అంకిరెడ్డి తెలిపారు. ఈ ఉచిత పరీక్షలు మహిళల్లో అవగాహన పెంచడమే కాకుండా ప్రాణాలను కాపాడే కీలక అడుగుగా నిలుస్తాయని అన్నారు.

నూతన క్యాన్సర్ బ్లాక్‌లో నిర్ధారణ నుంచి చికిత్స వరకూ అన్ని విభాగాలను ఒకే వ్యవస్థలో సమీకరించారు. దీని ద్వారా రోగులు అనేక కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, సమయపాలనతో కూడిన సమగ్ర వైద్య సేవలు అందనున్నాయన్నారు.

**నిర్ధారణే అత్యంత కీలకం..**

క్యాన్సర్ చికిత్సలో అత్యంత ముఖ్యమైన అంశం ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించడం. ఈ దృష్టితోనే కిమ్స్‌లో పెట్‌స్కాన్ వంటి అత్యాధునిక నిర్ధారణ పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఇవి వ్యాధి వ్యాప్తిని ఖచ్చితంగా గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

**సమగ్ర చికిత్స విధానం**

నూతన క్యాన్సర్ బ్లాక్‌లో సర్జికల్ ఆంకాలజీ ద్వారా శస్త్ర చికిత్సలు, మెడికల్ ఆంకాలజీ ద్వారా కీమోథెరపీ, రేడియేషన్ ఆంకాలజీ ద్వారా మెరుగైన చికిత్సలు ఒకే చోట అందించనున్నారు. అంతే కాకుండా బ్రాకీ థెరపీ వంటి ఆధునిక రేడియేషన్ విధానాలు అందుబాటులోకి రావడం ద్వారా చికిత్స నాణ్యత మరింత మెరుగుపడనుంది.

## ఆదర్శప్రాయుడు ఓబులరెడ్డి: డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డి

**ప్రజాశక్తి-మార్కాపురం**

స్వాతంత్ర్య సమరయోధులు, కందుల ఓబులరెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా నిస్వార్ధ సేవలు అందించారని, పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేసినట్లు శ్రీ కందుల ఓబులరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్‌వికెపి కళాశాల ఎదుట ఉన్న స్వర్గీ కందుల ఓబులరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ గౌతం నాగిరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఆస్తులను సైతం త్యజించారన్నారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడినందుకు జైలు జీవితం గడిపారన్నారు.

# కలల సాకారం

పశ్చిమ ప్రాంతవాసులకు కొత్త జిల్లా కలల సాకారం అయింది. ఏడాదిన్నర తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసింది. ప్రక్రియ మొదలయ్యాక ఆగమేఘాలపై నిర్ణయాలు జరిగిపోయాయి. జిల్లా కేంద్రంలో ఆఫీసులను ప్రారంభోత్సవం చేశారు. నాలుగు నియోజకవర్గాలతో పశ్చిమ ప్రాంతం ఇప్పుడు కొత్త జిల్లాగా అవతరించింది. ఆ ప్రాంత ప్రజానీకంలో స్వతంత్ర జిల్లాగా అవతరణపై ఉత్సాహం పెరిగింది. ఏదో సాధించామనే ఆనందం కూడా కనిపిస్తోంది. కూటమి నేతలు సంబరాల్లో మునిగిపోయారు. దీన్నుంచి రాజకీయ లబ్ది పొందడం ఎలా అన్నదీ ఇప్పటినుంచే మొదలైంది. ఎవరి వ్యూహాల్లో వాళు న్నారు. జిల్లా ప్రకటించాక పశ్చిమ ప్రాంతంలో నిజంగానే ప్రభుత్వం పట్ల సానుకూలత పెరిగింది. ఇక ఈ ప్రాంతంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అప్పట్లో మూడు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలను వేరుచేసి ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచీ జిల్లా అభివృద్ధికి చర్యలు ఆశించిన స్థాయిలో లేవు. వెనుకబాటు వెంటాడింది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగపడలేదు. వలసలు కొనసాగుతున్నాయి. సాగునీరు, తాగునీటికి ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో మళ్లీ జిల్లాల పునర్విభజన ముందుకు వచ్చింది. గత ప్రభుత్వం పార్లమెంటు స్థానాల వారీగా చేసిన జిల్లాల్లో పారదర్శకత, శాస్త్రీయత లోపించింది. ఎన్నికల్లో కొత్త జిల్లాలపై హామీలు ముందుకు వచ్చాయి. తదనుగుణంగానే ఇప్పుడు మార్కాపురం జిల్లా ఏర్పాటైంది. ఏ సమస్యతో జిల్లాల ఏర్పాటు తెరపైకి వచ్చిందో ఆ అంశంపై కేంద్రీకరించాలి. ప్రజల ఆకాంక్షలు తీర్చేలా చర్యలు చేపట్టాలి. సహజ వనరుల ఆధారంగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాల్సిఉంది. అందుకు చిత్తశుద్ధితో నిధులు కేటాయించాలి. సాగునీరు, తాగునీరు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలి. జిల్లా కేంద్రంలో నూతన కార్యాలయాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలి. వెలిగొండను పూర్తి చేయడం కూడా ఇప్పుడు ప్రభుత్వానికి కీలకంగా మారింది. సొరంగాలు పూర్తయ్యాయి. నిర్వాసితులకు పరిహారాలు ఇచ్చి తరలించాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ప్రాంతానికి కీలమైన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశారు. ఇపుడు రెండో కీలక ఎజెండాగా వెలుగొండపై దృష్టి సారించారు.

జిల్లా పరిషత్ సమావేశంలో ప్రోటోకాల్‌పై రగడ నడిచింది. జడ్పీ పాలకపక్షం పూర్తిగా వైసిపి చేతిలో ఉంది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగాక రాజకీయ వ్యూహాలు మారిపోయాయి. జడ్పీలో తిరుగులేని మెజార్టీతో ఉన్న వైసిపి పాలకపక్షం హఠాత్తుగా ప్రభుత్వం దృష్టిలో ప్రతిపక్షంగానే మారింది. తెలుగుదేశం మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు తక్కువగా ఉంటోంది. ఇక్కడ రెండు వైరివర్గాలు మారిపోయారు. జడ్పీ పాలకపక్షం ఇపుడు యంత్రాంగంపై విమర్శలు దాడిమొదలు పెట్టింది. అంతేకాకుండా మండలాల్లో ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు వైసిపి ప్రజా ప్రతినిధులను పిలవడంలేదు. దీన్ని పశ్నించేందుకు జడ్పీని వేదిక చేసుకున్నారు. శనివారం నాడు జరిగిన జడ్పీలో తొలుత ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ స్వయంగా గళం విప్పారు. ఎమ్మెల్యేలను కూడా పిలవడంలేదని, జడ్పీటీసీలకు కనీసం ఆహ్వానం కూడా లేదని వాపోయారు. నూతన జిల్లా ప్రారంభోత్సవానికి కూడా ఎవరినీ ఆహ్వానించలేదని ధ్వజమెత్తారు. ప్రోటోకాల్ రగడ కొత్తేమీకాదు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రతిపక్షాల నుంచి గెలిచిన వారిపట్ల ఇదే తీరు చాలా కాలంగా నడుస్తోంది. గతంలో వైసిపి ప్రభుత్వం ఉన్నపుడూ తెలుగుదేశం ఎమ్మెల్యేలకు ఇదే అనుభవం ఎదురైంది. అపుడు వాళ్లు.. ఇపుడు వీళ్లు అంతే. ఇప్పటికైనా పార్టీల తీరు అధికారంలో ఉన్నపుడు మారాల్సి ఉంది. అధికారంలో ఉన్నపుడు హుందాగా వ్యవహరిస్తే ప్రతిపక్షంలోకి వెళ్లాక కూడా అదే హుందాతనం దక్కుతుందని గుర్తించాలి.

రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేస్తోంది. గత ప్రభుత్వం రైతుల పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ వేశారు. దాన్ని తీసుకోవడానికి రైతులు అనాసక్తి చూపారు. ఇపుడు ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. రాజముద్రతో ఇపుడు కొత్త పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తోంది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తమ నియోజకవర్గాల్లో లాంఛనంగా పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ సందర్భంగా రైతులకు గుర్తు చేశారు. రాజముద్రతో ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులు స్వాగతించారు. ఇక రెవెన్యూ పరమైన సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వీటి పరిష్కారాలు కనిపించడం లేదు. 22ఏ కింద చూపిన భూములకు పరిష్కారం ఏమిటన్నదీ స్పష్టత లేదు. కలెక్టర్లకు ఇచ్చిన అధికారాలతో వీటి పరిష్కారం సవాలుగా మారింది. అనేక తరహా రెవెన్యూ వివాదాలు ఇప్పుడు యంత్రాంగానికి పెద్ద తలనొప్పిగా మారాయి. ఇక్కడ పరిష్కారం కానందున మంగళగిరిలో మంత్రులు నిర్వహించే ప్రజావేదికకూ పోతున్నారు. తాజాగా కలెక్టర్ రాజబాబు రెవెన్యూ క్లినిక్ పేరుతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజాదర్బారు నిర్వహించారు. పరిష్కారాలపై లోతుగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, గ్రామాల్లో రాజకీయ ఒత్తిళ్లు, పెత్తనాలతోనే సగం రెవెన్యూ వివాదాలు పేరుకుపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం కూడా రోడ్ మ్యాప్ తయారు చేస్తోంది.